ప్రేమ ఫలిస్తే మంచు వెన్నెలసోన
ప్రేమ వికటిస్తే దావానలాగ్ని వాన.
ఏది జరిగినా తప్పని బాధ హృదయానికే.

# లాలిత్య



చందమామ ఆకాశ రాజ్యాన్నే లుతున్నాడు. విరహంతో భూమిని గాఢంగా హత్తుకున్నంట్లుంది వెన్నెల. లేత చల్లదనంతోపాటు కరిగిన వెండి స్ప్రే చేస్తున్నం టున్నందా వింత శోభ. మాలతి పూలు విరబూసేయి. పందిరి క్రింద నా మంచం, దానిపైన ముప్ఫయి పయిబడ్డ నేను. నాలో చనల బరువుకి కాబోలు మొయ్య లేక మొయ్యలేక మోస్తున్నట్టు అప్పుడప్పుడు నా మంచం మూలుగులు.

నా స్వంతం అంటూ వుంటే నా ఇల్లొక్కటే. నన్ను కూడా లెక్కల్లోకి తేవాలంటే నా మనస్సు మైనస్ చేస్తేనే.

రోజూ సూర్యుడెలా ఉదయిస్తాడో, పేపరు వాడు పేపరెలా తెస్తాడో మా గోడవతల ప్రక్కింటిలో అలాగే కొన్ని రొటీన్లు.

ఇల్లంతా ఏలుకో అన్నట్లు నా కప్పగించి, వాళ్ళని మరిచిపోతానేమో అన్న భయంతో హాల్లో వాళ్ళ పటాలు వుంచి తల్లిదండ్రులు చక్కాపోయేరు. నా మీద ఎంత మమకారమో, ఏమో ఆస్తి విచ్ఛిన్నమవకుండా అనుభవించమని నన్నొక్కణ్ణే కన్నారు.

రోజూ రాత్రి 7 గంటలకి భోజనం ముగించి నేను మాలతిపందిరి క్రింద పడుకుంటాను. 7-30 గంటలకు వాళ్ళింట్లో భోజనాల పారంభం. వంటలు రుచులెలాగుంటాయో ఏమోగాని ఆ చేతితో వడ్డన తినడానికి పెట్టిపుట్టాలి. భోజనా లయ్యాక కొంతసేపు ఆ స్వీట్ హోమ్ వంటింటి చక్కబాట్లు. ఆ గృహిణి జీవన సహచరుడు టి.వి. చూస్తూ డ్రాయింగ్ రూమ్‌లో కూర్చుంటాడు.

అప్పటి నుంచి మొదలవుతుంది నా గుండె లోని సలసలకాగే మానెలో గలగల వేచే హృద్భార. చూడకుండా వుండలేను. చూస్తే భరించలేను. వంటింటి తలుపు మూసుకున్నాక కొంతసేపు నిశ్శబ్దం. కాస్సేపటికి వస్తుంది వయ్యారంగా డ్రాయింగ్ రూమ్‌లోకి పరువాల పంట. పాల నురుగు చీరతో, జాజులో, మల్లెలో, మొల్లలో తల నిండా పెట్టుకుని తెల్లని తేలిక మబ్బు పాలపుంతలో నక్షత్రాల ఉనికిని కూడా లెక్కచేయకుండా చంద్రుణ్ణే చేరుకుంటున్నట్లు, తారలన్నీ కుళ్ళి కుళ్ళి చస్తే తనకేమి? ఎద చంద్రుడు తనవాడైనప్పుడు. తనంటే ఆ చీర కెంత మక్కువోగాని నడుం చుట్టూ చుట్టి పొందిగ్గా బొడ్డు దగ్గర దోపుకుంటే ప్రేమగా చేతుల్తో అందాన్నంతా బంధించినట్లుంటుంది. తన పార్టనర్ దగ్గరగా వచ్చి అతని భుజం మీద గడ్డం మోపి చూపుడు వేలుతో గడియారం వేపు చూపిస్తుంది. వాళ్ళ గది కిటికీ తలుపు వేస్తూ నా వేపు కవ్వింపుగా హల్లో, గుడ్‌నైట్ అన్నట్లు చూస్తుంది. అంతే, ఆ తరువాత బ్రహ్మ, సరస్వతులయిపోతారు. ప్రకృతికి కొంత శోభ అందించాలిగా. రోజూ ఇలాగే జరుగుతున్నా భరించడం కష్టంగా వుంది. మనస్సు వెనక్కి పరుగెత్తడం మానదు.

*   *   *

నాలుగేళ్ళ క్రితం ఆ ముద్దబంగారంతో మా ఇంట్లో దిగేరు వాళ్ళమ్మా, నాన్న. అప్పటికే మా నాన్న లేరు. అమ్మే వాటా అద్దెకిచ్చింది. ఆ వాటాలో స్విచ్చిలూ, వైరులూ సరిగా వున్నాయో, లేవో చూడమంది. లేడిలా బెదురుతూనే కళ్ళతో నవ్విస్తుందా బంగారు బొమ్మ. లయ తప్పి నా మనస్సుకు మల్లే వణుకుతున్న చేతుల్తో బల్బులూ అవీ అందించింది. ఆ రోజు నుంచీ అప్పుడప్పుడు కనబడుతూ తన అందమైన కళ్ళతో మనసును గాలంతో కెలికినట్లు కెలుకుతూనే వుంది. అందుకేనేమో నా ఫ్రెండ్ సీతారాం అంటాడు - "సృష్టి రహస్యమంతా నవ్వించే సుందరీ ముఖపద్మంలోనే వుంటుందని."

పూలు కోసుకోవచ్చా?

ఈ వనమంతా నీదే. నీ ఇష్టం. నిన్నడిగే వాళ్ళు లేరు.

అత్తయ్యగారేమంటారో?

ఒక్కసారిగా గుండె నేతుల్తో అదిమిపట్టుకున్నాను. ఆ మాటే అంత హాయి కలిగించిందే, నిజంగా ఈ ఇంటి కోడలైతే ఈ తోటని తన కోసం బృందావనం చెయ్యనా? ప్రకృతిలో వున్న పూలన్నీ పూయించనా?

ఏమనర్లే నే చూసుకుంటాను.

నీ పేరు?

లాలిత్య!

ఆ రోజు నుంచి తోటలో చిన్న చిన్న రాళ్ళూ, బెడ్డలూ ఆ ముద్దబంతి పాదాల కెక్కడ గుచ్చుకుంటాయో అని ఏరిపారేయడం, మొక్కలకు పాళాలు కట్టి నీళ్ళు పోయడం నాకొక ముఖ్యమైన దిన చర్య.

తనొచ్చిన దగ్గరి నుంచి ఇల్లంతా సందడిగా వున్నట్లు ఏదో తెలీని ఉత్సాహం. ఉద్యోగాని కెళ్ళాలనిపించేది కాదు. తరచుగా సెలవుపెట్టి కూర్చునేవాణ్ణి. అప్పుడప్పుడూ మా ఇంట్లో కొచ్చి అమ్మతో కాసేపు మాట్లాడి వెళ్ళేది. అమ్మ మాత్రం తనకంత చొరవ ఇచ్చేది కాదు. ఒక రోజు నేనే అడిగాను. ఆ పిల్ల మీద నీ అభిప్రాయం ఏమిటని? చక్కని చుక్క. బుద్ధిమంతురాలు. చదువుకుంది. ఇంకేం కావాలంది. కాదు, ఈ ఇంటి కోడలిగా అన్నా.

నోరు మూసుకో. వాళ్ళ శాఖ వేరు. మన శాఖ వేరు. రెండోది, మీ నాన్నగారు పోతూ, పోతూ మీ అత్త కూతుర్ని చేసుకోమని నీ దగ్గర మాట తీసుకున్నారు. మరచిపోయేవా? అవును, మాటిచ్చేను. కానీ, ఈ పిల్లంటే నాకు చాలా ఇష్టం. నన్నేం చెయ్యమంటావు? రెండో ప్రసక్తి లేదు. సుమతిని చేసుకుని తీరవలసిందే. లేకుంటే మీ నాన్న ఆత్మ శాంతించదు అని విరాగ్గా వెళ్ళిపోయింది. ఏం చెయ్యలేకపోయేను. సాధ్యమైనంత వరకూ 'లాలిత్య'కు కనబడకుండా తప్పించుకుంటున్నాను.

ఓ రోజు అమ్మ ఎవరింటికో వెళ్ళింది. చీకటి పడుతూంటే డాబీ మీద అటూ, ఇటూ తిరుగుతున్నా. దూదిపింజెలా తేలుతూ వచ్చింది లాలిత్య. ముత్యాల మూటలా వుంది. పచ్చని పరికిణీ, జాకెట్టూ, తెల్ల ఓణీ అందం ఆరబోసి నట్లుందా చందం.

ఏం చేస్తున్నారు?


ఏం తోచట్లేదు. అందుకని ...

కబుర్లు చెప్పుకుందామా?

ఏమున్నాయి. స్వర్గంలో ఇంద్రుడి గురించా, నరకంలో యముడి గురించా. కాలుష్యం గురించా, కర్పూరం గురించా. వెన్నెల గురించా, గాఢాంధకారం గురించా?

మీ ధోరణే నా కర్థం కావడం లేదు. ఈ రోజేం అలా వున్నారు?

దయచేసి నన్నేం అడక్కు. నా మనస్సు



□ సోమ

# ప్రేమ, పెళ్ళి, స్నేహం, విధి ఆడే నాలుగు స్తంభాలాటలో ఓటమి ఎప్పుడూ ప్రేమకేనా?



బాగోలేదు.

నేనొచ్చినా బాగులేదా? నేను మీకు నచ్చ లేదా? పోనీ వెళ్ళిపోనా?

మాట్లాడలేదు. వెళ్ళిపోయింది. కాస్సేపటికి అమ్మ వస్తే కిందకి వెళ్ళిపోయాను. రెండు నెలలు కనబడుతున్నా కలుసుకోలేదు. ఓ రోజు మధ్యాహ్నం చెట్టు క్రింద కూర్చొని పుస్తకం చదువుతున్నాను. వెనుక నుంచి రెండు మెత్తని చేతులు నన్ను స్పృశించేయి మనసూ, మమతా లాగ. తల త్రిప్పి చూసే లోపల మెడలో ఒక దండ పడింది మాలతీ పూలతో.

ఎంత పని చేసేవు?

ఏం, తప్పా?

దండ మెళ్ళో వేస్తే అర్థం తెలుసా?

నా కవసరం లేదు. దేవుడికి వేస్తాం. గురువుకు వేస్తాం. అర్థాలు మనిష్టమే. ఇవ్వాళ మీ పుట్టిన రోజని తెలిసింది. ఏదేని మీ కిద్దాం అంటే స్వీకరించకపోవచ్చు. నా మీద అలక సాగిస్తున్నారు కదా! ఇలా అయితే అంగీకారం ప్రమేయం లేదు. తప్పైతే క్షమించండి. మీరు ఎందుకు కొత్త బట్టలు వేసుకోలేదు? మీకు అచ్చిరాదా? ఇష్టం లేదా?

భాష వచ్చే మాట్లాడలేని నోరు, హృదయం వుండీ ఇచ్చుకోలేని స్వేచ్ఛా నావి. నన్ను దయచేసి ఒంటరిగా వుండనీ.

వెళ్ళిపోయింది. లేచి దండ గదిలో మేకుకు తగిల్చి చెమ్మగిల్లిన కళ్ళు తుడుచుకున్నాను.

సుమతిని కాళ్ళ మీదపడి ప్రార్థిస్తాను. నాకు త్యాగం చెయ్యమని. తనకి మరో మంచి సంబంధం నేనే చూసి తన పెళ్ళి అయ్యేకే నేను పెళ్ళి చేసుకుంటానని చెప్పడానికి నిర్ణయించుకున్నాను.

పది రోజులు సెలవు పెట్టి నాగపూర్ వెళ్ళాను. చాలా ప్రేమగా రిసీవ్ చేసుకున్నారు వాళ్ళంతా. సుమతి కనబడలేదు. కాలేజీకి వెళ్ళింది. ప్రత్యేక "హల్లో" అని సింపుల్‌గా పలకరించింది. భోజనాలయ్యేక మెల్లగా తన గదిలో కెళ్ళాను. రా కూర్చో అని పేలవంగా నవ్వింది. సంభాషణ ఎలా మొదలుపెట్టాలో తోచలేదు.

నిన్ను డిస్టర్బ్ చేస్తున్నానా?

అదేం లేదు. ఫ్రెండ్‌కి ఉత్తరం రాస్తున్నా. బావా! నీకొక విషయం ధైర్యంగా చెప్పాలి. నన్ను క్షమించు. మనిద్దరికి పెళ్ళి చేద్దామని మన పెద్ద వాళ్ళు నిర్ణయించేరు. నాకు దగ్గర సంబంధం మీద నమ్మకం లేదు. ఇంతవరకు ప్రేమించు కోలేదు కాబట్టి నే నింకొకర్ని చేసుకుంటే నీ కన్యాయం చేసినట్లవదని నా మనసు చెప్తున్నది. నీ నిర్ణయం ఏదైనా నా నిర్ణయం మాత్రం నా ఫ్రెండ్ నిఖిల్‌తోనే నా పెళ్ళి. ఇంట్లో ఒప్పుకోక పోతే తెగించి రిజిస్టర్ మారేజి చేసుకుందుకి నిర్ణయించుకున్నాను. చట్టం హక్కుల్ని కాపాడుతుందిగా.

నిజంగానే పాదాల మీద పడిపోయేను. ఆనందాన్ని ఆపుకోలేక ఏడ్చాను. మనస్సులో వున్న దంతా ధైర్యంగా చెప్పి నా సమస్యని పరిష్కరించి నందుకు అభినందించేను. గుర్రంలా కోరికలు పరుగెడుతూ వుంటే లాలిత్యను లాలించడానికి వెంటనే తిరుగు ప్రయాణమైవచ్చేను.

గేటు తలుపు తీస్తూనే వాళ్ళ ద్వారం వైపు చూశాను. పెద్ద తాళం వేసి వుంది. పిచ్చి కోపం వచ్చింది. ఇంట్లోకి వెళ్ళి అమ్మని మెల్లిగా అడిగాను. "ఆ పిల్ల చిన్నాన్న పోయాడట. నిన్ననే వెళ్ళారు. నెల రోజుల వరకూ రారు" అంది.

"వాళ్ళ అడ్రస్ ఇచ్చారా?"

"ఏం వెళ్తావా. బుద్ధి లేకపోతే సరి" అంది. సుమతి గురించి చెప్తే కట్టుకథ అని కొట్టిపారేసింది. సరే, మెల్లగా తనకే తెలుస్తుంది కదా అనుకున్నా.

రోజులు యుగాల్లా గడుస్తున్నాయి. ఇల్లంతా చిన్నపోయింది. తోట సంరక్షణ మానేశా. నెల్లాళ్ళకి వాళ్ళమ్మా, నాన్న వచ్చారు. తను రాలేదు. వాళ్ళతో మాట్లాడాలంటే నాకు అంత పరిచయం లేదు. దీని వెనుక అమ్మ ప్రయోజకత్వం తప్పకుండా వుండి వుంటుంది.




ఏడాది క్రితం అమ్మ కూడా పోయింది. దిక్కులేని నాకు దిక్కులే దిక్కు. ఆరు నెలల క్రితం లాలిత్య, భర్త విజయ్‌తో మా ప్రక్కింట్లో దిగింది నన్ను దెబ్బతియ్యడానికే అన్నట్లు. క్రమంగా ఒంటరి బ్రతుకు అలవాటు చేసుకున్నాను. పగలంతా ఉద్యోగం, స్వయంగా వండుకోవడం. ఇల్లంతా బూజులు పట్టాయి. తోటంతా ఎండిపోయింది. రాత్రి పడుకుంటున్నప్పుడు మాత్రం వద్దు అనుకుంటూనే అటు చూడ్డం తప్పలేదు.

ఓ రోజు రాత్రి 8 గంటలయింది. నేను లేటుగా ఇంటికొచ్చి వండుకుంటున్నా. లేత చేతులతో తలుపు కొట్టినట్లయింది. తీసి చూశాను. ఆశ్చర్యం! పాల నురుగు చీర. మల్లెల గుబాళింపు. చిరునవ్వుతో ప్రకృతంతా వాకిట ముందు మొకరిల్లినట్లు లాలిత్య.

"పుట్టిన రోజు శుభాకాంక్షలు."

"థ్యాంక్స్. కూర్చో"

"లేదు. వెళ్తా."

"ఒక్క నిమిషం" ఫ్లాస్కులో కాఫీ పోసి ఇచ్చాను.

"మీ వారింకా రాలేదా?"

"ఊరెళ్ళారు. తొమ్మిది గంటలకు వస్తారు."

"ఇన్నాళ్ళూ ఎందుకు కనబడలేదు?"

"రోజూ చూస్తూనే వున్నారుగా!"

"నా మీద జాలి లేదా?"

"ఎందుకూ?"

"నా ఒంటరి బ్రతుకు ..."

"పెళ్ళి చేసుకోవచ్చుగా ..."

"నువ్వంటే మీ వారికిష్టమేనా?"

"చాలా!"

"నీకు?"

"ఇంకా!"

"పొరపాటు."

"మరి?"

"కేవలం విశ్వాసం."

"ఎందుకని?"

"నా కడ్డం రాకుండా యోగ్యుడైన ఇంకొక మహానుభావునికి నన్నేలుకునే అవకాశం ఇచ్చినందుకు."

"నా మీద కక్షా?"

"లేదు. అసమర్థులంటే కొంచెం జాలి." అంటూ లేచి వెళ్ళబోయింది.

"ఒక్క ప్రార్థన. నా మీద విశ్వాసం వుంటే మా వేపు కిటికీలన్నీ మూసేయి. ఆ ఒక్క సహాయం చెయ్యి. వచ్చే జన్మలో నీ ఋణం తీర్చుకుంటా."

"అలాగే తప్పకుండా!"

గదిలోకి వెళ్ళగానే అమ్మా, నాన్న ఫోటోలు "చూసేవా ఒంటరిగా సృష్టిలోని అందాల్ని జుర్రుకోడానికెంత మంచి అవకాశమిచ్చేమో" అన్నట్లు చిరునవ్వు లొలికిస్తున్నాయి.

మేకుకి తగిల్చిన దండ మీద సాలీడు దట్టంగా గూడు కట్టుకుంది.

నేను అసమర్థుణ్ణి కాదు.

అభాగ్యుణ్ణి మాత్రమే!